క్లుప్తంగా

31న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ అత్యవసర సమావేశం ఈనెల 31న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ శనివారం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

మోతాదుకు మించి వద్దు



మట్లాడుతున్న ఏడీఏ నాగపద్మిని

సదుం: పంట పొలాలకు మోతాదును మించి రసాయనిక, పురుగుల మందుల వాడకం అనర్థమని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని సూచించారు. మండలంలోని బూరగమంద రైతు భరోసా కేంద్రంలో రైతు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే లాభాలను తెలియజేశారు. పశువుల పేడ, గోమూత్రాన్ని ఉపయోగించి అన్ని పంటలు పండించవచ్చన్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ, ఉపయోగాలను వివరించారు. తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని, ఫలితాల ఆధారంగా అవసర మైన ఎరువులనే వాడాలన్నారు. సిబ్బంది లలిత, అఖిల్, మనీషా, చాందిని పాల్గొన్నారు.

2న కేన్సర్ వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆగస్టు 2న బీఎంఎస్ క్లబ్‌లో ఉచిత కేన్సర్ వైద్యశిబిరం నిర్వహించనున్నారు. శనివారం క్లబ్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ శివ మాట్లాడుతూ ఎస్‌వీఐసీసీఏఆర్ టాటా కంపెనీ తిరుపతి వారి సహకారంతో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. చిన్నతనం నుంచి కేన్సర్ లక్షణాలను గుర్తించేందుకు వీలుగా శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. కేన్సర్ లక్షణాలు కలిగిన వారు శిబిరానికి హాజరై వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. వైద్యపరీక్షలతోపాటు చికిత్స కూడా ఉచితంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలువల్లో పూడికతీత పనులు



పనులను పరిశీలిస్తున్న ఈఓ

వి.కోట: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత పనులు చేపడుతున్నట్లు ఈఓ యాదవపతి తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని వి.కోట-పేర్నంబట్ జాతీయ రహదారిలో చేపడుతున్న మురుగు నీటి కాలువల పూడికతీత పనులను ఆయన, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు పరిశీలించారు. వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా మురుగునీటి కాలువలపై పలువురు వ్యాపారస్తులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో కాలువలు పూర్తిగా పూడిపోయాయని, ప్రస్తుతం పూడికతీసి వాటిని వినియోగంలోకి తేనున్నట్లు పేర్కొన్నారు.

మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

చౌడేపల్లి: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయాలని ఎంఈఓ కేశవరెడ్డి వంట నిర్వాహకులకు సూచించారు. శనివారం చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. మెనూ ప్రకారం వంట చేయకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతతోపాటు పరిశుభ్రత ముఖ్యమని సూచించారు. అనంతరం విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, హెచ్‌ఎం నాగరాజరెడ్డి పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని కళాశాల ప్రిన్సిపల్ మహమూద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ రాసి అర్హత సాధించని వారు, టెన్త్ పాసైన వారు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అందులో సూచించారు. ఇతర వివరాల కోసం కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

జాగ్రత్తలే శ్రీరామరక్ష

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం
- నీరు, ఆహార పదార్థాల కలుషితమే ప్రధాన కారణం
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



పెద్దపంజాణిలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మురళి (ఫైల్)



రాయలపేటలో పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు (ఫైల్)

పెద్దపంజాణి: వానా కాలం వ్యాధుల సీజన్.. ఇప్పుడే జ్వరాలు ముప్పేటదాడి చేస్తుంటాయి. పరిసరాల శుభ్రత పాటించకపోవడం, వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉంది. ఫలితంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వీటి నివారణకు వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

సీజనల్ వ్యాధుల లక్షణాలు..

టైఫాయిడ్..

జ్వరం అధికంగా ఉండి తగ్గకపోవడం, విపరీతమైన చెమట, విరేచనాలు, కడుపునొప్పి, అలసట, ఆకలి లేకపోవడం, మలబద్ధకం, చర్మంపై దద్దుర్లు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది సాల్మొనెల్లా టైఫి బాక్టీరియా వల్ల వస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల ఈవ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందుతుంది.



బసవరాజుకండ్రిగలో మలాతియన్ స్ప్రే చేస్తున్న పంచాయతీ సిబ్బంది (ఫైల్)

చికున్ గున్యా..

దోమకాటు వల్ల చికున్‌గున్యా వ్యాధి వస్తుంది. తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులు లక్షణాలు. ఇది సోకితే మొదటి రెండు, మూడు రోజులు జ్వరం ఎక్కువగా ఉంటుంది. వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుంది.

డెంగీ..

వైరల్ జ్వరం మాదిరి హఠాత్తుగా జ్వరం వస్తుంది. తీవ్రమైన ఒళ్లు నొప్పులు ఉంటాయి. ఎముకలు విరిగిపోతున్నంత బాధ కలుగుతుంది. పొట్ట, కాళ్లు, చేతులు, ముఖం, వీపు భాగాల చర్మంపై ఎర్రగా కందినట్టు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమించే అవకాశం ఉంటుంది. ఈడిస్ ఈజిప్ట అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ పగటి పూట కుడుతుంది.

మలేరియా..

తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం మలేరియా వ్యాధి లక్షణాలు. మలేరియా జ్వరం తగ్గిన తర్వాత మళ్లీ వస్తుంది. 14 రోజుల తర్వాత అధిక జ్వరం వస్తుంది. మలేరియా ఆడ అనాఫిలస్ దోమ కాటు కారణంగా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయి.

దోమలకు ఆవాసాలివే..

వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం దోమలే. ఇళ్ల పరిసరాల్లో మురుగుగుంటలు, నీటి కుండీలు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, మట్టి, ప్లాస్టిక్ పాత్రలు, ఇతర ఖాళీ వస్తువులు, టైర్లలో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు వాటిలో చేరి గుడ్లు పెట్టే అవకాశం ఉంది. దోమల లార్వా వేగంగా వృద్ధి చెందుతుంది. వీటివల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్ విష జ్వరాలు ప్రబలుతుంటాయి. వాతావరణ మార్పులతో అతిసారం వంటి వ్యాధులకు గురవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. జ్వరం వచ్చి ఇబ్బంది పడేకంటే.. ముందస్తు జాగ్రత్తలు ముఖ్యమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచిస్తున్నారు.

ఇలా చేద్దాం..ఆరోగ్యంగా ఉందాం..



మనం తినే ఆహారం వేడిగా ఉండేలా చూసుకోవాలి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఈగలు, దోమలు వాలిన ఆహార పదార్థాలను తినరాదు. నీటి కాలుష్యం కారణంగా డయేరియా, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఫిల్టర్ చేసిన లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. దోమ కాటుకు గురికాకుండా మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీటి గుంతల వద్ద బ్లీచింగ్ పౌడర్, దోమలు వృద్ధి చెందకుండా మందులు స్ప్రే చేయాలి.

– నందిని, రాయలపేట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి

ప్రజల భాగస్వామ్యంతోనే నియంత్రణ



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామాల్లో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మాస్క్ ధరించడం ద్వారా చాలా వరకూ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని తెలియజేశాం. చేతులు తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా నీరు నిల్వలేకుండా, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించాం.

– మురళి, పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్‌ఓ

పలమనేరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పాతపేట అర్బన్ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ మాధవి తెలిపారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా స్థానిక ఆస్పత్రిలో మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

గుడిపాల: విద్యుత్ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిచంద్ర అన్నారు. శనివారం 189 కొత్తపల్లె సెక్షన్ పరిధిలోని విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించి రికార్డులన్నింటినీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంట్ బిల్లుల అందరూ సక్రమంగా చెల్లించేలా చూసుకోవాలన్నారు. విద్యుత్ తీగలు ఎక్కడైనా కిందకు వేలాడుతుంటే వెంటనే వాటిని మరమ్మతులు చేసే విధంగా చూడాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా వెంటనే స్పందించి సకాలంలో పనులు పూర్తిచేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ కరీముల్లా పాల్గొన్నారు.

అటవీశాఖ భూమి సర్వే

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె చెక్‌పోస్ట్ కూడలిలో ఉన్న అటవీశాఖ భూమిని రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేశారు. బైరెడ్డిపల్లె చెక్‌పోస్ట్ కూడలిలో ఉన్న 86/2ఏ సర్వే నంబర్‌లో 10 సెంట్ల స్థలంలో అటవీశాఖ అధికారులు చెక్‌పోస్టు నిర్వహించేవారు. 1996లో రెవెన్యూ అధికారులు తొరిడి గ్రామానికి చెందిన కమలమ్మ, సుశీలమ్మ కుటుంబీకులకు ఈసర్వే నంబర్లలో పట్టాలు అందజేశారు. అప్పటి నుంచి అటవీశాఖ అధికారులకు, కమలమ్మ, సుశీలమ్మ కుటుంబీకుల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో కోర్టును ఆశ్రయించారు. కమలమ్మ, సుశీలమ్మ కుటుంబీకులకు అనుకూలంగా కోర్టు తీర్పు నిచ్చింది. అయితే అటవీశాఖ అధికారులు మాత్రం ఆ స్థలం తమదేనంటూ బోర్డు ఏర్పాటు చేశారు. ఎఫ్‌ఆర్‌ఓ శివన్న ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆ స్థలం అటవీశాఖకు సంబంధంలేదని కోర్టు తీర్పును అనుగుణంగా వెళ్లాలన్నారు. తహసీల్దార్ స్వర్ణలత, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు వద్ద సర్వే చేస్తున్న అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు

కోలాహలం..రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం శనివారం కోలాహలంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రథాన్ని పూలు, పచ్చటి తోరణాలతో అలంకరించారు. ముస్తాబైన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని వేదపండితుల ఆధ్వర్యంలో రథంలో ఉంచారు. అనంతరం వి.కోటకు చెందిన శ్రీనివాసులు కుటుంబసభ్యులు స్వంత నిధులతో రూ.10 లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన రథానికి పూజలు చేశారు. అనంతరం భక్తుల హరోహరా మురుగా నామస్మరణతో రథాన్ని ఆలయం చుట్టూ లాగారు. కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకంతో రథాన్ని లాగుతూ ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణించారు.

ఆలయానికి గడియారం వితరణ

వి.కోట: గుడివంకలో వెలసిన శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి మండలానికి చెందిన దామోదరంరెడ్డి గోడ గడియారం వితరణగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆడి మాసం సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా నేడు స్వామి వారి రథోత్సవానికి హాజరై స్వామి వారి ఆలయానికి తన వంతు సాయంగా ఈ గోడ గడియారం వితరణగా అందజేసినట్లు తెలిపారు.

నేడూ విద్యుత్ బిల్లులు కట్టవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ వినియోగదారులకు విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాల్లో బిల్లులు కట్టవచ్చన్నారు. వినియోగదారులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



తవణంపల్లె హైస్కూల్‌లో మొక్కకు నీరు పోస్తున్న విద్యార్థిని

తవణంపల్లె: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ అధికారి వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం తవణంపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లులచే మొక్కలు నాటించారు. ఏపీఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి పోషించడం అలవర్చుకోవాలని సూచించారు. చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలల్లో విజయవంతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజులరెడ్డి, హెచ్‌ఎం దేవరాజులరెడ్డి, ఏఎస్‌ఓ నరోత్తమరెడ్డి పాల్గొన్నారు.

డాయ్ బాధితుల ఫిర్యాదుల వెల్లువ



పలమనేరు పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

- బాధితులతో కిక్కిరిసిన పలమనేరు పోలీస్‌స్టేషన్
- స్థానిక మెప్మా ఆర్‌పీలపై ఫిర్యాదు చేసిన గ్రూపు మహిళలు
- మొత్తం చేసింది ఆర్‌పీలేనంటూ ఫిర్యాదుల్లో వెల్లడి



పీఎస్ వద్ద డాయ్ యాప్ బాధితులు

పలమనేరు: కట్టిన నగదుకు రెట్టింపు వస్తుందని ఆశపడి డాయ్ అనే యాప్‌లో డబ్బులు కట్టి కోట్లాది రూపాయలు మోసపోయిన సంఘటన పలమనేరులో వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన బాధితులు శనివారం సైతం పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను ఆన్‌లైన్ మోసాలుగా భావించి సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు పంపనున్నట్లు స్థానిక సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మరోవైపు పట్టణంలోని గ్రూపుల్లో సభ్యురాళ్లుగా ఉంటూ సంబంధిత ఆర్‌పీల మాటలు నమ్మి భారీగా డబ్బులు కట్టిన బాధితులు సీఓలు, ఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక మెప్మా టీఎంసీ(టౌన్ మిషన్ కోఆర్డినేటర్)ఉమేష్‌జాదవ్‌కు ఫిర్యాదు చేశారు. మెప్మా పీడీకి సైతం ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. తమ గ్రూపు కార్యకలాపాల్లో కీలకమైన ఆర్‌పీల మాటలు నమ్మి తాము మోసపోయామని ఇందుకు కారణమైన ఆర్‌పీలపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన మెప్మా అధికారులు సోమవారం స్థానిక మెప్మా కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఆర్‌పీలను విచారించనున్నట్లు తెలిసింది. కాగా బాధితులు వేలసంఖ్యలో ఉండడంతో మరో నాలుగైదు రోజుల దాకా దీనిపై ఫిర్యాదులు అందే పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది.

ఏపీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడి నియామకం



ఏపీ ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం

పలమనేరు: ఏపీ ఉద్యోగుల సంఘం పలమనేరు తాలూకా అధ్యక్షుడిగా కేసీ జయశంకర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పట్టణంలోని ప్లేగు యూనిట్ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారి దైవకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డా.మహ్మద్, కార్యదర్శిగా రమణ, కోశాధికారిగా నజీర్, హనుమంతు, జ్యోతీశ్వర్, విద్యాసాగర్, హనుమంతుతోపాటు పలువురు సభ్యులుగా ఎంపికయ్యారు.

ముళ్ల కంపలను తలపిస్తున్న విద్యుత్ స్తంభాలు

- మరమ్మతులకు ఇబ్బంది పడుతున్న సిబ్బంది



క్లబ్ వద్ద వైర్లతో నిండిపోయిన స్తంభం



మర్రిమానువీధిలో కేబుళ్లతో నిండిన విద్యుత్ స్తంభం

కుప్పంరూరల్: పట్టణంలోని విద్యుత్ స్తంభాలు ప్రైవేట్ కేబుళ్లు, డిష్ వైర్లు, ఇతర వైర్లతో కలిసి ముళ్ల కంపలను తలపిస్తున్నాయి. రెస్కో అధికారులు ఏదైనా మరమ్మతులు చేసేందుకు విద్యుత్ స్తంభాలు ఎక్కాలంటే కుదరడం లేదు. దీంతో విద్యుత్ సమస్యలు ఎదురైతే సిబ్బంది పాట్లు చూడనలవి కాదు. పట్టణంలో రెస్కో పరిధిలో విద్యుత్ సరఫరా జరుగుతోంది. సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల్లో ప్రైవేట్ కేబుళ్లు, డిష్ వైర్లు, ఇతర వైర్లతో స్తంభాలు నిండిపోవడంతో ఏదైనా విద్యుత్ సమస్యలు ఎదురైనప్పుడు రెస్కో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కనీసం స్తంభం ఎక్కేందుకు సైతం వీలు కావడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే విద్యుత్ వైర్లు తెగి ఈ కేబుళ్లపై పడితే ఇళ్లలోని గృహోపకరణాలు మరమ్మతులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇదేకాకుండా నిత్యం ఏదో ఒక చోట డిష్ వైర్లు కట్ అయి పడితే జనం విద్యుత్ వైర్లుగా తలచి భయాందోళనకు గురవుతున్నారు. రెస్కో ఉన్నతాధికారులు విద్యుత్ స్తంభాలకు చుట్టిన అనధికారిక కేబుళ్లలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సెబ్ ఏఎస్పీ సుబ్బరాజు

చిత్తూరు అర్బన్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ సుబ్బరాజు సూచించారు. శనివారం చిత్తూరు నగరంలోని స్కాన్ ఇండియా ట్రైనింగ్ సెంటర్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మహిళా చట్టాలు-విద్యార్థులకు 'మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే పర్యవసనాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం ఇటీవల సమాజంలో పెరుగుతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. దీనివల్ల సమాజం మొత్తం ఆత్మరక్షణలో పడే పరిస్థితి వస్తుందన్నారు. ఇక మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన చట్టాలను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. బాలలపై లైంగికదాడుల నివారణ కోసం పోక్సో చట్టం రూపొందించారన్నారు. మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని, ఫిర్యాదు అందిన వెంటనే ప్రతిస్పందిస్తామన్నారు. గృహ హింస నిరోధక చట్టం మహిళల హక్కులకు రక్షణగా నిలుస్తుందన్నారు. లైంగికదాడి, అసభ్యకర ప్రవర్తన, అఘాయిత్యాలపై మహిళలకు చట్టంలో కల్పించిన రక్షణ గురించి వివరించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

సదుం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి సూచించారు. మండలంలోని ఎంజేపీ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో అటవీశాఖ అధికారులతో కలసి స్కూల్ ఆవరణలో వివిధ రకాల మొక్కలను శనివారం నాటారు. మానవాళికి ఎంతో అవసరమైన ఆక్సిజన్ చెట్ల నుంచే లభిస్తుందని విద్యార్థులు గుర్తించాలని ఆయన చెప్పారు. కాలుష్య నివారణకు చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఫారెస్ట్ సిబ్బంది మహేష్, షాజహాన్, చిన్నయ్య, రమణ, సిద్దయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు

పుంగనూరు: పట్టణంలోని ఎన్ఎస్.పేటలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కళాశాల కమిటీ సభ్యులు భక్తవత్సలరాజు తెలిపారు. శనివారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా ఆవరణలో మొక్కలు నాటారు. కమిటీ సభ్యులు సమావేశమై కళాశాలలో సీసీ రోడ్లు, కాలువలు, సైకిల్ స్టాండ్, ప్రహరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కళాశాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు పట్టణ ప్రముఖులు, పూర్వపు విద్యార్థులు సహకరించాలని కోరారు. కమిటీ సభ్యులు రెడ్డెప్పరెడ్డి, వైద్యులు ప్రభాకర్, శరణ్, రమేష్‌బాబు, సత్యనారాయణ, బాలసుబ్రమణ్యం, శ్రీధర్, ప్రవీన్, సురేష్ పాల్గొన్నారు.

కల్లూరులో శిక్షా సప్తాహ్

పుంగనూరు: కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్ 7వ రోజు కార్యక్రమాన్ని శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు నిర్వహించారు. ఏకో క్లబ్ గ్రీన్ మాస్టర్ వెంకటసిద్ధులు ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ చేపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకున్నారు. కన్వీనర్ రాజేంద్ర, ఉపాధ్యాయులు వేణుగోపాల్, స్నేహ, మాలిని, సైదుల్లా, ప్రకాష్, చంద్రబాబు, ఈశ్వరయ్య, విక్టోరియా పాల్గొన్నారు.





కల్లూరు హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, పుంగనూరులో..



సదుం: మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్



పలమనేరు: ఎకో క్లబ్ విద్యార్థులతో ఎంఈఓ లీలారాణి, టీచర్లు

విద్యార్థుల ఎకో క్లబ్‌ల ఏర్పాటు

పలమనేరు: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేసుకోవాలని స్థానిక ఎంఈఓ లీలారాణి సూచించారు. ఆమేరకు స్థానిక గురుకుల పాఠశాలలో శనివారం ఎకోక్లబ్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. మొక్కలను పెంచడం ద్వారా మనిషికి కలిగే మేలుని ఆమె విపులంగా వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రశాంతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.